7

సాక్షి అనకాపల్లి

శనివారం । 21 । జూన్ । 2025



25 వేల మందితో సూర్య నమస్కారాలు

- రికార్డు సృష్టించిన ఆదివాసీ విద్యార్థులు
- గిన్నిస్ రికార్డుతో అద్భుతం
- నేడు ప్రకటించనున్న 'గిన్నిస్' ప్రతినిధులు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయ మైదానం వేదికగా అల్లూరి సీతారామ రాజు జిల్లాకు చెందిన 106 పాఠశాలల విద్యార్థులు అద్భుతమైన ప్రపంచ రికార్డును నెలకొల్పారు. కల్మషం లేని మనసులతో, చిరునవ్వులను ఆభరణంగా ధరించిన 25 వేల మందికి పైగా చిన్నారులు ఒకేసారి, లయబద్ధంగా యోగాసనాలు వేస్తూ సరికొత్త గిన్నిస్ రికార్డును సాధించారు. గతంలో 21,800 మంది విద్యార్థులతో నెలకొల్పిన రికార్డును వారే తిరగరాశారు. ఈ అద్భుత ఘట్టం ద్వారా విశాఖ నగరం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రికార్డు పుటల్లోకి ఎక్కాయి.

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ సూర్య నమస్కారాల ప్రదర్శన, కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో జరిగింది. 108 నిమిషాల వ్యవధిలో, 108 ఆసనాలను 25 వేల మందికి పైగా చిన్నారులు ఏకకాలంలో ఒకే వేదికపై ప్రదర్శించి ఈ రికార్డును లిఖించారు. ఈ రికార్డు వివరాలను శనివారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అధికారికంగా ప్రకటించనున్నారు.



విద్యార్థుల క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న సిబ్బంది

మంత్రుల ప్రశంసలు

కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ మాట్లాడుతూ, ఒకే వేదికపై 25 వేల మంది గిరిజన విద్యార్థులు ఇంతటి మహోన్నతమైన ప్రపంచ రికార్డును స్థాపించడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మన స్ఫూర్తిగా అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో నివసించే విద్యార్థులు పట్టణ ప్రాంతాల విద్యార్థుల కంటే ఎంతో దృఢంగా ఉన్నారని ప్రశంసించారు. పట్టణ యువత జంక్ ఫుడ్ తింటూ, మొబైల్స్‌లో మునిగిపోయి శారీరక వ్యాయామాన్ని విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, కార్యక్రమానికి హాజరైన చిన్నారుల నిబద్ధత, పట్టుదలను అభినందించారు. ప్రపంచం మొత్తం విశాఖ నగరం వైపు చూసే విధంగా చిన్నారులు ఈ సరికొత్త రికార్డు సృష్టించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నూతన రికార్డును సృష్టించిన చిన్నారులను దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి తరఫున అభినందించారు. ఇక్కడి చిన్నారులను చూస్తుంటే తన కుమారుడు దేవాన్ష్ గుర్తుకు వస్తున్నాడని, ఇదే క్రమశిక్షణ తన కుమారుడికి నేర్పించాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఆంధ్రుల కోరికలను ప్రధాని మోదీ తీరుస్తున్నారని, రాష్ట్రానికి అన్ని విధాలా సహాయం అందిస్తున్నారని లోకేష్ పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపారని, రైల్వే జోన్ ఇచ్చారని, అమరావతి అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశారని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సీఎస్ విజయానంద్, యోగా ప్రత్యేక అధికారి కృష్ణబాబు, అనకాపల్లి ఎంపీ సి.ఎం రమేష్, కలెక్టర్ ఎం.ఎస్ హరేందిర ప్రసాద్, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఆయుష్ శాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ రికార్డును పరిశీలించే ప్రత్యేక బృందం మొత్తం ప్రక్రియను వీడియో తీసింది. హాజరైన ప్రతి విద్యార్థికి ఒక క్యూఆర్ కోడ్‌ను అందించి, వాటిని ప్రాంగణంలో స్కానింగ్ చేసి చిన్నారుల లెక్కింపు జరిపారు.

యోగాంధ్రకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి సంఖ్య 7,72,812	యోగా ప్రదర్శకులు 1,438	ఎల్‌ఈడీ స్క్రీన్లు 335
జనం తరలింపునకు వాహనాలు 9,995	యోగా శిక్షకులు 907	మరుగుదొడ్లు 4,280
	గిన్నిస్‌బుక్ రికార్డు నమోదు కోసం ప్రతినిధులు 4,600	పార్కింగ్ ప్రదేశాలు 75



యోగాంధ్రకు విశాఖ సిద్ధం

నేడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

గిన్నిస్ రికార్డు లక్ష్యంగా 5 లక్షల మందితో యోగాసనాలు

హాజరుకానున్న ప్రధాని మోదీ, సీఎం, ఇతర ప్రముఖులు

18 క్రీడా మైదానాల్లో ప్రదర్శనలు.. బీచ్ రోడ్డులో 326 కంపార్ట్‌మెంట్లు

ఉదయం 6.30 నుంచి 7.50 వరకు కార్యక్రమం

భారీగా భద్రతా చర్యలు

విశాఖ సిటీ: అపూర్వ స్థాయిలో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ సిద్ధమైంది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల పొడవునా, 5 లక్షల మందితో యోగా ప్రదర్శన నిర్వహించి రికార్డు సృష్టించాలని జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. నగరంలోని 18 క్రీడా మైదానాల్లోనూ యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. కార్యక్రమం శనివారం ఉదయం 6:30 గంటలకు ప్రారంభమై ఉదయం 7:50 గంటలకు ముగుస్తుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు, తూర్పు నావికాదళ అధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొంటారు.

26 కిలోమీటర్ల బీచ్ రోడ్డు పొడవునా భారీ సంఖ్యలో పాల్గొనేవారి కోసం కాళీమాత ఆలయం నుంచి భీమిలి వరకు మొత్తం 326 కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో యోగా శిక్షకులు, ముగ్గురు ప్రదర్శకులు, పది మంది వలంటీర్లు, ఒక ఏఎన్ఎం, ఆశా వర్కర్, ఒక పోలీసు అధికారి, గిన్నిస్ రికార్డు నమోదు కోసం పది మంది ప్రతినిధులు (మొత్తం 4,600 మంది ప్రతినిధులు), ఒక ఫుడ్ ఇన్‌చార్జి, ఇద్దరు సూపర్‌వైజర్లు, పారిశుధ్య పర్యవేక్షకులు, నలుగురు పారిశుధ్య కార్మికులు ఉంటారు.

ఉత్తరాంధ్ర నుంచి 9,995 వాహనాలు



ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజలను తరలించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం మొత్తం 9,995 వాహనాలను వినియోగిస్తున్నారు. వీటిలో 7,295 బస్సులు, 2,500 ఆటోలు, 200 మేక్సీ క్యాబ్‌లు ఉన్నాయి. మొత్తం 75 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయమే నిర్ణీత ప్రాంతాలకు బస్సులను పంపించారు. అల్లూరి జిల్లా నుంచి శుక్రవారం ఉదయం నుంచే తరలింపు ప్రక్రియ చేపట్టగా, మిగిలిన జిల్లాల నుంచి అర్ధరాత్రి వాహనాల్లో బీచ్ రోడ్డుకు తరలించారు. ప్రజలను ఏ కంపార్ట్‌మెంట్ వద్ద దించారో, అక్కడే వారిని తిరిగి వాహనంలోకి ఎక్కించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌కు బస్సులను మ్యాపింగ్ కూడా చేశారు.

10 వేల మంది పోలీసులతో భద్రత

ప్రశాంత వాతావరణంలో యోగాంధ్ర వేడుకలు జరిగేలా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఐపీఎస్‌ల నుంచి కానిస్టేబుళ్ల వరకు విశాఖకు రప్పించారు. 10 వేల మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రధాని కాన్వాయ్ వెళ్లే ప్రాంతాలను బాంబ్, డాగ్ స్క్వాడ్లతో తనిఖీలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణపైనా దృష్టి సారించారు.

11 వేల మంది నేవీ సిబ్బంది

యోగాంధ్ర కార్యక్రమంలో తూర్పు నావికాదళం భాగస్వామ్యమవుతోంది. ఆర్కే బీచ్ సముద్ర తీరంలో 11 నావికాదళం, కోస్ట్‌గార్డు నౌకలలో నేవీ అధికారులు యోగాసనాలు వేయనున్నారు. అలాగే, ఆర్కే బీచ్ నుంచి భీమిలి మధ్యలో 10 కంపార్ట్‌మెంట్లలో 11 వేల మంది నేవీ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు యోగాభ్యాసన చేస్తారు.

5 లక్షల లక్ష్యం సాధ్యమేనా?



యోగాంధ్ర కార్యక్రమానికి 5 లక్షల మందిని తరలించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ఆ బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. ఒక్కో సచివాలయానికి లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో వారు తమకు తెలిసిన వారితో పాటు సచివాలయానికి వచ్చిన వారందరి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసేశారు. చాలా మందికి రిజిస్ట్రేషన్ జరిగిన విషయం కూడా తెలియదు. తాము రిజిస్ట్రేషన్ చేయకుండానే మొబైల్‌కు మెసేజ్‌లు వచ్చాయని ఆశ్చర్యపోయారు. కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఏదేమైనప్పటికీ, మొత్తం 7,72,812 మంది ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో 5 లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేస్తున్నా, అది ఎంత మేరకు సాధ్యమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, ఉమ్మడి విశాఖ నుంచి ప్రజలను అర్ధరాత్రి సమయంలో తరలించడం పెద్ద సవాలుగానే కనిపిస్తోంది. డ్వాక్రా మహిళలు తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని గ్రూప్ లీడర్ల ద్వారా ఒత్తిడి తెస్తున్నట్లు, లేనిపక్షంలో రూ.500 ఫైన్ కట్టాలని, పథకాలు నిలిచిపోతాయని బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో వీరు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయి. మిగిలిన వారు మాత్రం అర్ధరాత్రి సమయంలో ఇతర జిల్లాల నుంచి వచ్చే అవకాశాలు తక్కువని అధికారులు సైతం అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ, రెండు లక్షల వరకు ప్రజలు వస్తే గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కే అవకాశం ఉంటుందని ఆశాభావంతో ఉన్నారు.

ప్రధానికి ఘన స్వాగతం



మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు **ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం** సాయంత్రం విశాఖ చేరుకున్నారు. **ఆయనకు ఎయిర్ పోర్టులో ఘన** స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ **అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా** చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు **కె. రామ్మోహన నాయుడు**, శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి **పవన్ కల్యాణ్, విద్యా శాఖ** మంత్రి నారా లోకేష్, స్పీకర్ సీహెచ్. **అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌చార్జ్** మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, **ఎంపీ ఎం. శ్రీభరత్**, ప్రభుత్వ విప్ పి. గణబాబు తదితరులు **ఆయనకు స్వాగతం పలికారు**. అంతకు ముందు ముఖ్యమంత్రి **చంద్రబాబు నాయుడు విజయవాడ** నుంచి విమానంలో విశాఖకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఐఎన్ఎస్ డేగాకు **వెళ్లి ప్రధానికి స్వాగతం పలికారు**. అనంతరం నేరుగా కలెక్టరేట్‌కు చేరుకొని బస చేశారు.

18 క్రీడా మైదానాల్లోనూ వేడుకలు

సాగరతీరంతో పాటుగా మరో 18 క్రీడా మైదానాల్లో కూడా యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏయూ మైదానం, చినగదిలి గోల్ఫ్ క్లబ్, పీఎం పాలెం క్రికెట్ స్టేడియం, కొమ్మాది స్టేడియం, పోర్ట్ స్టేడియం, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం తదితర 18 క్రీడా మైదానాలు, మరో 30 అదనపు ప్రాంతాల్లోనూ యోగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.



యోగాంధ్రకు ముస్తాబైన క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్

4,280 మరుగుదొడ్ల ఏర్పాటు



ప్రతి వంద మందికి ఒక టాయిలెట్ చొప్పున మొత్తం 4,280 మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా 35 మంది పాములు పట్టేవారితో పాటు పెద్ద సంఖ్యలో గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. పర్యవేక్షణకు డిప్యూటీ కలెక్టర్లతో పాటు, అఖిల భారత అధికారులు కూడా అందుబాటులో ఉంటారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో తాగునీరు, స్ట్రెచర్, ఫస్ట్ ఎయిడ్ కిట్, స్నాక్ బాక్సులు సిద్ధంగా ఉంటాయి. పాల్గొనే ప్రతి ఒక్కరికీ యోగా మ్యాట్, టీ షర్ట్ అందజేస్తారు. యోగా ప్రదర్శన అనంతరం వీటిని తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించడానికి, బయటకు వెళ్లేందుకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేశారు. అందరికీ కనిపించేలా 335 ఎల్‌ఈడీ స్క్రీన్లు, 326 వైఫై పాయింట్లు, సౌండ్ సిస్టమ్ అందుబాటులో ఉంచారు. అత్యవసర మందులతో కూడిన 104 వాహనాలతో పాటు, ప్రతి 5 కిలోమీటర్లకు ఒక 5 పడకల ఆసుపత్రిని సిద్ధం చేశారు.

ఉద్యోగాంధ్ర కావాలి



- యోగాంధ్ర పేరుతో ప్రజల దృష్టి మళ్లించే యత్నం
- నిరుద్యోగ భృతి అందించే బాధ్యత నుంచి తప్పించుకోలేరు
- కూటమి ప్రభుత్వంపై ఏఐవైఎఫ్ ధ్వజం

8లో

నేటి నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్


నర్సీపట్నం: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం శనివారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.తాతాజీ తెలిపారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. 21న ర్యాంకు 1 నుంచి 15,000లు, 22న 15,001 నుంచి 32,000, 23న 32,001 నుంచి 50,000, 24న 50,001 నుంచి 68,000, 25న 68,001 నుంచి 86,000, 26న 86,001 నుంచి 104,000, 27న 104,001 నుంచి 120,000, 28న 120,001 నుంచి చివరి ర్యాంకు వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందన్నారు.

శ్రీవరాహ లక్ష్మీ నృహరి శతకం పుస్తకావిష్కరణ

సింహాచలం : సింహగిరిపై శుక్రవారం శ్రీవరాహ లక్ష్మీ నృహరి శతకం పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. భాషా ప్రవీణ శ్రీమాన్ అద్దంకి వెంకట రాఘవాచార్యులు రచించిన ఈ పుస్తకాన్ని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆవిష్కరించారు. రచయిత అద్దంకి వెంకట రాఘవాచార్యులు మాట్లాడుతూ సింహాచలంలో 32 నృసింహ రూపాలు దర్శనమిస్తాయని, సామాన్యులకు ఆ రూపాల లక్షణాలను తెలియజేసేందుకు ఆలయ బేడా మండపంలోని స్తంభాలపై వాటిని చెక్కారని వివరించారు.

ప్రయాణికులకు యోగాంధ్ర కష్టాలు

- జనం తరలింపునకు ఆర్టీసీ బస్సుల మళ్లింపు
- అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి 160 బస్సుల తరలింపు
- ప్రయాణికుల ఇబ్బందులు.. ఆటో చార్జీలు రెట్టింపు



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల నిరీక్షణ



బస్సుల కోసం నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల పడిగాపులు

సాక్షి, అనకాపల్లి/నర్సీపట్నం/ఎస్.రాయవరం/అనకాపల్లి : ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టు.. విశాఖలో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం జిల్లాలో బస్సు ప్రయాణికులకు తిప్పలు తెచ్చిపెట్టింది. జనం తరలింపునకు రెండు రోజుల ముందుగానే బస్సులు తరలించారు. అనకాపల్లి డిపో నుంచి 90, నర్సీపట్నం డిపో నుంచి 70 బస్సులను మళ్లించడంతో పలు ప్రాంతాలకు సర్వీసులను గణనీయంగా కుదించారు. దీంతో బస్సులు ఎప్పుడొస్తాయో తెలియక, వచ్చిన బస్సులో చోటు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఏజెన్సీ ప్రాంతాలను ఆనుకుని ఉన్న అనకాపల్లి జిల్లాలో మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సే దిక్కు. నర్సీపట్నం డిపో నుంచి కేడీ పేట, కొయ్యూరు, తాండవ, సరుగుడు వంటి ప్రాంతాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఆటోల్లో డబుల్ చార్జీలు చెల్లించుకుని వెళ్లాల్సి వచ్చింది.

దూర ప్రాంత ప్రయాణికుల ఇక్కట్లు

విశాఖపట్నంలో మద్దిలపాలెం, వాల్తేరు డిపోల నుంచి అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, అచ్యుతాపురం, పరవాడ తదితర ప్రాంతాలకు నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. విశాఖ డిపో నుంచి పలు ప్రాంతాలకు 435 ఆర్టీసీ బస్సులు తరలించడంతో సాధారణ ఆర్టీసీ ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు.

◆ నర్సీపట్నం నుంచి తుని, చోడవరం, విశాఖ, కొయ్యూరు, చింతపల్లి, చోడవరం, అనకాపల్లి, అడ్డురోడ్డు ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సులు లేక కాంప్లెక్స్‌లో నిరీక్షించారు.

◆ అడ్డురోడ్డు జంక్షన్‌లో బస్సు కోసం గంటల తరబడి ప్రయాణికులు వేచి ఉన్నారు. వచ్చిన బస్సు కిక్కిరిసినప్పటికీ మరో బస్సు వస్తుందో లేదోనని అదే బస్సు ఎక్కేందుకు పోటీ పడ్డారు.

◆ అనకాపల్లి నుంచి జిల్లాలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్సుల కొరతతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిక్కిరిసింది.



అడ్డురోడ్డులో కిక్కిరిసిన బస్సు

జిల్లాలో 4,698 యోగా వేదికలు



యోగాంధ్ర ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- అన్ని మండలాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు
- అధికారులతో కలెక్టర్ సమీక్ష

తుమ్మపాల: జిల్లాలో యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె జిల్లా అధికారులతో కలిసి శనివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా 4,698 వేదికల వద్ద జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నద్ధతపై అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాలు, మండలాలు, జిల్లా కేంద్రంలో యోగా వేడుకలను ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించాలన్నారు. విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు విచ్చేయనున్న నేపథ్యంలో అన్ని చోట్ల 8 లక్షల మంది యోగాభ్యాసన కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, స్వయం సహాయక బృందం సభ్యులు, ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు, ఆశా వర్కర్లు , విద్యార్థులు, సాధారణ ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసి యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇప్పటికే 7,72,812 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, ట్రైనర్లు, పాల్గొన్న వారికి సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా యోగాంధ్ర సమన్వయ అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాంధ్ర కావాలి

- యోగాంధ్ర పేరుతో ప్రజల దృష్టి మళ్లించే యత్నం
- నిరుద్యోగ భృతి అందించే బాధ్యత నుంచి తప్పించుకోలేరు
- కూటమి ప్రభుత్వంపై ఏఐవైఎఫ్ ధ్వజం



నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాబీ

అనకాపల్లి: విద్యార్థులకు మూడు రోజుల పాటు యోగాంధ్ర కోసం సెలవులు ఇవ్వడం విడ్డూరంగా ఉందని, అసలు యోగాంధ్ర వద్దని, ఉద్యోగాంధ్ర కావాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబీ డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ భృతి కోసం శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి ఇంట్లో ఎంత మంది నిరుద్యోగులు ఉంటే అందరికీ ఉద్యోగం వచ్చే వరకూ నెలకు రూ.3 వేలు చొప్పున భృతి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ ఒక్కరికి నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, రెండో ఏడాది నిరుద్యోగులను మోసం చేస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని నేటికీ అమలు చేయలేదన్నారు. సుమారు 16 వేల పోస్టులతో తూతూ మంత్రంగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని, వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారుగా 2.36 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి మోసం చేస్తుందన్నారు. యోగాంధ్ర పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే యత్నం ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. యోగాంధ్ర పేరుతో రాష్ట్రంలో పలు జిల్లాల్లో విద్యా సంస్థలు మూసివేసి ఆ బడి బస్సులలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యం ఇస్తోందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వేమల కన్నబాబు, వియ్యపు రాజు, జిల్లా సహాయ కార్యదర్శ జి.ఫణీంద్ర కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.బాబ్జి, నాయకులు సింహాద్రి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

యోగప్రస్థ ఆశ్రమం

- అనకాపల్లిలో 50 ఏళ్ల క్రితమే యోగాభ్యాసం
- నలుగురితో ప్రారంభమై 500 మందికి శిక్షణ
- యోగా సెంటర్ కోసం భవనం నిర్మించిన డాక్టర్ సీతారామారావు

యోగా అంటే.. పరిచయం అక్కర్లేదని పదం. ఇప్పుడది విశ్వవ్యాప్తమైంది. సామాన్యుడికి తెలియని రోజుల్లో అనకాపల్లిలో నలుగురు మిత్రులతో ప్రారంభమైన ఆయన యోగా దిన చర్య నేడు 500 మందికి చేరువైంది. ఐదు దశాబ్దాల క్రితమే యోగా విశిష్టతను గుర్తించి తన తదనంతరం యోగాభ్యాసం కొనసాగాలన్న సంకల్పంతో సొంత భవనాన్ని రాసిచ్చేశారు డాక్టర్ బి. సీతారామారావు. ఆయన ఆశయాన్ని ప్రత్యేక కమిటీ నేటికీ కొనసాగిస్తోంది.



సుఖాసనం వేస్తున్న బాలుడు ఆదిత్య



యోగా కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న స్థానికులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని చిన్నవీధిలో ఒక పాత ఇంట్లో 1975లో నలుగురు మిత్రులు యోగాభ్యాసం ప్రారంభించారు. వారి ఆశయం ఇక్కడితో ఆగిపోకూడదనే ఉద్దేశంతో నలుగురిలో ఒకరైన డాక్టర్ బి. సీతారామారావు 1980లో తన సొంత నిధులతో యోగా కేంద్రం పేరుతో ఒక భవనం నిర్మించారు. దీని ద్వారా నామమాత్రపు రుసుంతో సభ్యులకు యోగాసనాలు ఆయనే నేర్పించేవారు. ఈ క్రమంలో తన తదనంతరం యోగా శిక్షణ ఆగిపోకూడదనే ఉద్దేశంతో తన అభ్యాసకుల పేరు మీద బిల్డింగ్ రాసి ఇచ్చారు. 2012లో చనిపోయిన ఆయన ఎల్లకాలం యోగా సెంటర్ కొనసాగాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షతో ఒక బలమైన బైలా రూపొందించాడు. దాని ద్వారా ప్రతీ రెండేళ్లకొకసారి అధ్యక్ష, కార్యదర్శుల పాలక వర్గాన్ని సభ్యుల ఎన్నిక ద్వారా నియమించుకోవాలి. ఐదేళ్లకొకసారి చైర్మన్ నియమించుకొని, ఆయనే గురువుగా యోగా సెంటర్ నిర్వహించాలి. నూతనంగా ఎన్నికైన కమిటీ ద్వారా యోగా సెంటర్ నిరంతరం కొనసాగాలని నియమావళి రూపొందించారు. మగవారికి, ఆడవారికి వేర్వేరు సమయాలను కేటాయించారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు ఆయన ఆశయాలకు అనుగుణంగానే యోగా కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు.



ప్రాణాయామం చేస్తున్న వృద్ధుడు గణపతి





అనకాపల్లి చిన్నవీధిలోని యోగా కేంద్రం, కేంద్రం ఫౌండర్ డాక్టర్ సీతా రామారావు

500 మంది సభ్యులతో నడుస్తోంది



యోగా సెంటర్ ప్రారంభం నాటి నుంచి నేటి వరకు 500 మంది సభ్యులుగా ఉన్నారు. వారందరూ వారి వీలును బట్టి యోగా సెంటర్‌కు వచ్చి యోగా చేసుకుంటారు. ఆడవారికి ఉదయం 11, సాయంత్రం 5, 6 గంటలకు, మగవారికి ఉదయం 5, 6 గంటలకు బ్యాచ్‌లుగా సమయం కేటాయించాం.

– జంగాల శ్రీనివాస్, కోశాధికారి, అనకాపల్లి యోగా సెంటర్

మూడు విడతల్లో పరిహారం చెల్లింపునకు అనుమతి

- మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు వెసులుబాటు

సాక్షి, అనకాపల్లి: నక్కపల్లి మండలంలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మూడు విడతల్లో రైతులకు నష్టపరిహారం చెల్లించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ నిర్మాణాన్ని 2,080.76 ఎకరాల్లో రెండు దశలలో చేపట్టనున్న విషయం తెలిసిందే. ఎకరా ధర రూ.51,39,690లుగా నిర్ణయించి ఈ భూములను కేటాయించారు. రూ.లక్ష కోట్లకు పైగా పెట్టే పెట్టుబడి పెట్టే సంస్థకు నష్టపరిహారం మూడు విడతల్లో చెల్లించేందుకు వెసులుబాటు కల్పిస్తారు. ఈమేరకు ఏడాది కాలంలో మూడు వాయిదాలుగా నష్టపరిహారం చెల్లించాలని శుక్రవారం పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వు జారీ చేశారు. ఆర్సెలర్ మిట్టల్ అభ్యర్థనల మేరకు ఎస్ఐపీఐ (రాష్ట్ర పెట్టుబడి ప్రమోషన్ కమిటీ) సిఫార్సులతో ఏడాదికి 9 శాతం వడ్డీతో భూమి ధరను చెల్లించడానికి అనుమతి ఇచ్చారు. మొదటి విడత పరిహారంగా రూ.450 కోట్లు చెల్లించాలని జీవోలో పేర్కొన్నారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ఎస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలు సమీపంలో బైకు ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శుక్రవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ విభీషణరావు వివరాల ప్రకారం.. కొరుప్రోలు కొబ్బరి పీచు పరిశ్రమలో పని చేస్తున్న బీహార్‌రాజు(40) గురువారం రాత్రి గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై నడిచి వస్తున్నాడు. అదే సమయంలో కొరుప్రోలు వైపు వస్తున్న మరో వ్యక్తి బైక్ అతడిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఏడేళ్లుగా కొరుప్రోలులో నివాసం ఉంటున్న అతడు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పరిహారం కోసం వంటావార్పు

- అమలాపురంలో మత్స్యకారుల ఆందోళన
- నష్ట పరిహారం సొసైటీకే చెల్లించాలని డిమాండ్



శిబిరం వద్ద వంటావార్పుతో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు



అమలాపురంలో ఆందోళనకు దిగిన మత్స్యకారులు

నక్కపల్లి: అమలాపురంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం సేకరిస్తున్న భూములకు నష్ట పరిహారాన్ని మత్స్యకార సొసైటీకి చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలంటూ మత్స్యకారులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ప్రత్యేకంగా టెంట్లు వేసి నిరసన తెలియజేయడంతో పాటు, అక్కడే వంటావార్పు చేశారు. వివరాలిలా ఉన్నాయి.

అమలాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 410/4, 41, 418లో సుమారు 43 ఎకరాల మెట్ట భూమిని 1994లో ప్రభుత్వం కనకమహాలక్ష్మి మత్స్యకార సొసైటీకి లీజుకు ఇచ్చింది. గ్రామానికి చెందిన మత్స్యకారులంతా ఈ భూముల్లో సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. 2014లో భూసేకరణ సమయంలో ఈ సొసైటీ భూములను ఏపీఐఐసీ సేకరిస్తున్నట్లు అప్పటి కలెక్టర్ యువరాజ్ ప్రకటించారు. ఈ భూములపై ఆధారపడ్డ మత్స్యకారులంతా అధికారులను కలిసి ఉపాధి కోల్పోతామంటూ వినతిపత్రాలు అందజేశారు. ఈ భూములకు ఇచ్చే నష్టపరిహారం సొసైటీ పేరున మంజూరు చేస్తామని అప్పటి కలెక్టర్ మినిట్స్‌లో కూడా పొందుపరిచారని మత్స్యకార నాయకులు పెదకాపు తాతారావు తదితరులు చెబుతున్నారు. అప్పటి నుంచి ఈ భూములకు నష్ట పరిహారం చెల్లించాలని మత్స్యకారులు కోరుతున్నా అధికారులు పట్టించుకోడం లేదు. ఈ భూముల్లో ఏపీఐఐసీ అధికారులు రోడ్లు, కాలువల నిర్మాణానికి సిద్ధపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మత్స్యకారులంతా వెళ్లి అడ్డుకోవడంతో పోలీసుల సాయంతో ఈ భూములను స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. దీంతో మత్స్యకారులంతా ఈ భూముల వద్ద శుక్రవారం టెంట్లు వేసి ఆందోళన చేపట్టారు. వీరికి సీపీఎం జిల్లా నాయకులు ఎం.అప్పలరాజు, రాజేష్, సత్యనారాయణ తదితరులు సంఘీభావం తెలిపారు. భూములకు నష్టపరిహారం చెల్లించకుండా అధికారాన్ని అడ్డంపెట్టుకుని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని అప్పలరాజు, తదితరులు ఆరోపించారు. సొసైటీ సభ్యులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లో ఎన్ఏవోబీ కోసం సేకరించి మత్స్యకార సొసైటీ భూములకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందని గుర్తు చేశారు. అలాగే ఉప్పుటేరుకు వెళ్లే అన్ని మార్గాలను ఏపీఐఐసీ మూసివేసి, మత్స్యకారుల జీవనోపాధికి ఆటంకం కల్గించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఈ ఆందోళనలో మత్స్యకార నాయకులు వంకా కృష్ణ, రాజు, సూరిబాబు, అప్పలరాజు, పాల్గొన్నారు.

స్పెషల్ ఒలింపిక్స్ వాలీబాల్ పోటీల్లో కొమిర విద్యార్థి ప్రతిభ



తృతీయ స్థానంలో నిలిచిన తన జట్టు క్రీడాకారులతో గణేష్

రావికమతం: జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ యూనిఫైడ్ వాలీబాల్ పోటీల్లో రావికమతం మండలం కొమిర గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగ విద్యార్థి అప్పికొండ గణేష్ ప్రతిభ చూపాడు. ఈ నెల15 నుంచి 19 వరకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఈ పోటీలు జరిగాయి. 19 రాష్ట్రాల నుంచి 114 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఏపీ సమగ్ర శిక్ష పాఠశాలల తరఫున పాల్గొన్న రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులతో కూడిన బృందం వాలీబాల్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. మన రాష్ట్రం తరుపున ఈ టీమ్‌లో ఉన్న గణేష్ ప్రతిభ చూపించాడు. మానసిక దివ్యాంగుడైన గణేష్ బధిరుడు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో దివ్యాంగుల కోటలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన గణేష్‌ను రావికమతం భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు,మండల విద్యాశాఖ అధికారులు అభినందించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



మున్సిపల్ మేనేజర్‌కు సమ్మె నోటీసులందజేస్తున్న కార్మికులు

నర్సీపట్నం: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ), మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు సమ్మె నోటీసు ఇచ్చాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక లోకం సిద్ధమైందన్నారు. దీనిలో భాగంగానే ముందుగా సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలుకు పూనుకుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికే 8 గంటల పనిదినాలను 12 గంటలకు పెంచే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ చర్యలు కార్మికులను బానిసత్వంలోకి నెడతాయన్నారు. ఇప్పటికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదన్నారు. కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు బొర్రా శ్రీను, లోవరాజు, బాబురావు, హేమంత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రెండు క్వారీ లారీలకు జరిమానా

అనకాపల్లి టౌన్: మండలంలోని మార్టూరు జంక్షన్ వద్ద గురువారం రాత్రి రెండు క్వారీ లారీలను పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తుండటంపై ఒకొక్క లారీకి రూ.8,450 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పరిపాలనలో 'రెవెన్యూ' కీలకం



రెవెన్యూ డే వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: పాలనలో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని కలెక్టర్ విజయ్ కృష్ణన్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, భూసేకరణ, ఎన్నికలు, వివిధ ధ్రువీకరణ పత్రాల జారీ, ప్రభుత్వపథకాల అమలు తదితర అన్ని సేవల్లోను రెవెన్యూ సిబ్బంది ప్రధాన పాత్ర పోషిస్తారని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం వల్లే అన్ని కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయని చెప్పారు. రెవెన్యూ శాఖ పట్ల ప్రజలకు, ప్రభుత్వానికి గల నమ్మకం ఏమాత్రం తగ్గకుండా సేవలందించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు బాధ్యతగా సేవలందించాలన్నారు. కలెక్టర్ కార్యాలయ భూ పరిపాలన విభాగం పర్యవేక్షకుడు పి.వి. రత్నం మాట్లాడుతూ రెవెన్యూ డే గురించి వివరించారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి రెవెన్యూ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ, కలెక్టర్ కార్యాలయ కోఆర్డినేషన్ విభాగపు పర్యవేక్షకుడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తల్లితో గొడవపడి.. ఆమె కొడుకుపై కత్తితో దాడి

- నిలదీసినందుకు గాయపరిచిన నిందితుడు
- పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు



కత్తి దాడిలో గాయపడిన రాజు

రోలుగుంట: తన తల్లితో ఎందుకు గొడవకు దిగావని ఆమె కుమారుడు నీలాపు రాజు నిలదీయడమే తప్పైంది. 'నన్నే నిలదిస్తావురా అంటూ.. షేక్ కార్తీక్ కుమార్ తన స్కూటీలో కత్తి తీసి అతడి గొంతుపై గాయపరిచాడు. ఈ ఘటనపై క్షతగాత్రుడు తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై రామకృష్ణారావు శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మండలంలోని ఎం.కె.పట్నం పంచాయతీ శివారు సింగరాజుపేటకు చెందిన నీలాపు కొండమ్మ ఈ నెల 18న సాయంత్రం సమయాన రోడ్డు పక్కన నిలబడి ఉండగా, తన చేతిలో ఉన్న తపాల జారి కిందపడింది. ఆ సమయంలో చింతపల్లి నుంచి వస్తున్న కార్తీక్ కుమార్ స్కూటీని ఆపి రోడ్డుపై తపాల ఎందుకు పెట్టావని ఆమెతో గొడవకు దిగాడు. అదే సమయంలో అటుగా వస్తున్న ఆమె కుమారుడు రాజు తన తల్లితో ఎందుకు గొడవ పడుతున్నావని ప్రశ్నించాడు. దాంతో కోపోద్రిక్తుడైన కార్తీక్‌కుమార్ 'నన్నే ప్రశ్నిస్తావా' అని తన స్కూటీలో కత్తి తీసి అతడి గొంతుపై బలంగా కోసి 'నా పేరు షేక్ కార్తీక్‌కుమార్, నర్సీపట్నం బీసీ కాలనీ అని, నన్ను ఎవరూ ఏమీ చేయలేరు' అంటూ వెళ్లిపోయాడు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి క్షతగాత్రుడికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



సబ్ జైల్లో ఖైదీలతో మాట్లాడుతున్న 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ నికితా సెంగర్

అనకాపల్లి టౌన్: సబ్ జైల్లో నిందితులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ నికితా సెంగర్ సూచించారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లి సబ్ జైల్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సబ్ జైల్లో ఉన్న నిందితులతో మాట్లాడుతూ ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే ఉచితంగా ఇస్తామన్నారు. సబ్ జైల్లో ఉన్న గదులను న్యాయమూర్తి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కిరణ్, న్యాయ సహాయకులు సాయిరాం, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

రక్షణ రంగ పరిశోధనల్లో ఏయూ భాగస్వామ్యం

మద్దిలపాలెం: రక్షణ రంగ పరిశోధనల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యుల భాగస్వామ్యం ఉండాలని ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఏయూ అమెరికన్ కార్నర్‌లో వర్సిటీ రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం, ఎస్ఐడీఎం సంయుక్తంగా శుక్రవారం 'ఆప్టిమైజింగ్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ క్యాపబిలిటీస్ విత్ కొలాబరేషన్ ఆఫ్ ఎక్స్‌పర్ట్'‌దస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ పీహెచ్‌డీ పరిశోధకులకు రక్షణ సంబంధిత సమస్యలను అధ్యయన అంశాలుగా ఇవ్వాలని సూచించారు. పరిశోధన ప్రాజెక్టుల్లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులను భాగస్వాములను చేయడం ముఖ్యమన్నారు. త్వరలో ఆసక్తిగల ఆచార్యులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. డీఆర్‌డీవో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏయూలో నెలకొల్పడానికి కృషి చేస్తామన్నారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) ఏపీ శాఖ చైర్మన్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ విశాఖలో మేధావులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామని, ఇందులో ఏయూ కీలక పాత్ర పోషించాలని కోరారు. దేశీయంగా సాంకేతికతను అభివృద్ధి చేయడంలో ఏయూ ఆచార్యులు, నిపుణుల సహకారం ఆవశ్యకమని నొక్కిచెప్పారు. క్వాంటం కంప్యూటింగ్, పునరుత్పాదక ఇంధన వనరులు, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఏయూతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, సాంకేతిక, న్యాయ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో నిపుణుల అవసరం ఉందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ జ్యోతి

కశింకోట: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు నడిపల్లి సన్యాసిరావు, వ్యవసాయ సహాయకురాలు డి. రేవతి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలి

అనకాపల్లి టౌన్: దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథ్ బాబు కోరారు. చాలా దేశాల్లో ఈవీఎంల ద్వారానే ఎన్నికలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు ఏకపక్షంగా జరుగుతున్నాయని, దేశంలోని చాలా పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు నమ్మకం కలిగేలా కేంద్ర ఎన్నికల సంఘం బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఎన్నికలు నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు.

నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం రేపు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగం విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 22న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ పట్టణ, మండలాల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



విరాళం అందిస్తున్న దాత కుక్కుటేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి అనకాపల్లికి చెందిన చాగంటి కుక్కుటేశ్వరరావు రూ.లక్ష, కాకినాడకు చెందిన కస్తూరి జగన్నాథరావు రూ.లక్ష 120 విరాళాన్ని అందించారు. సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో ప్రోటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు విరాళాన్ని చెక్కు రూపంలో ఇచ్చారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 46 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,840	4,840
రెండో రకం	3,700	3,750
మూడో రకం	3,590	3,590

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
డ్రాగన్	:సత్యనారాయణస్క్రీన్-1
8 వసంతాలు	: సత్యనారాయణ స్క్రీన్-2
కుబేర	:పర్తిసాయి
సితారే జమీన్ పరే	:షిర్డీసాయి
పాప	:వెంకటేశ్వర
కట్టప్ప జడ్జిమెంట్	:శ్రీసత్య
హంటర్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 63 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు, బీ పాజిటివ్-21, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-7 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

కుక్కలున్నాయి జాగ్రత్త!



- గ్రామాల్లో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- భయాందోళనలో మండల, పట్టణ ప్రజలు
- నియంత్రణలో కూటమి పాలకులు విఫలం

తుమ్మపాల: మొరిగే కుక్కలు కరవని అంటారు అది ఒకప్పుడు... ఇప్పుడు కుక్కలు ఎక్కడపడితే అక్కడ పిక్కలు పట్టుకొని గాయపరుస్తున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వెంటాడి కరుస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు, చిన్నాపెద్ద అనే తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. కుక్కలు సంతతి రోజు రోజుకు పెరుగుతోంది. నిత్యం ఒకరో ఇద్దరో వాటి బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. అయితే నివారణ చర్యలు చేపట్టాల్సిన కూటమి పాలకులు విఫలమవుతున్నారు. అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేస్తే ఎండార్స్‌మెంట్‌లతో సరిపెట్టి చేతులు దులుపుకుంటున్నారు.

మండలంలో తుమ్మపాల, కొత్తూరు, పిసినికాడ, రేబాక, మామిడిపాలెం, మార్టూరు, వెంకుపాలెం, వేటజంగాలపాలెం, కూండ్రం, పట్టణంలో పలు ప్రాంతాల్లో వీధి కుక్కల సంఖ్య పెరగడంతో



రోడ్డుపై గుంపులుగా కుక్కలు

ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కుక్కల గుంపులు అధికమయ్యాయి. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడికి దిగుతున్నాయి. పంచాయతీ పాలకులు గ్రామాల పర్యవేక్షణను వదిలేశారు. సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• అధికారుల చర్యలేవి?

పట్టణంలోని పలు వార్డుల్లో, గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నా, వాటి నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది. కుక్కలతో ఆస్పత్రి పాలవుతున్నామని బాధితులు వాపోతున్నారు. వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి దాడి చేస్తున్నాయని, కొన్నిసార్లు ఇళ్లల్లోకి సైతం చొరబడుతున్నాయి.

• రహదారులపై మరింత ప్రమాదం.....

రహదారుల పక్కన గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల పరిధిలోని తుమ్మపాల-చోడవరం, అనకాపల్లి - పిసినికాడ, కొప్పాక-మారేడుపూడి గ్రామాలకు ప్రధాని రహదారిలో ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. రహదారిపై వెళ్తున్న చోదకులపై దాడులకు దిగుతున్నాయి. ఇక్కడ అనేక మంది రకరకాల కారణంగా ప్రమాదాలు సంభవించి గాయాలతో ఆస్పత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. గ్రామాల్లో ఎక్కడైనా కుక్కకాటుకు గురైన వారు అధికారులను నిలదీస్తే కనీసం స్పందించే పరిస్థితి కనిపించడం లేదు. కొత్తవారు గ్రామాలు, పట్టణంలోని కొన్ని వీధుల్లోకి, వార్డుల్లోకి అడుగు పెట్టాలంటే భయాందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో చీకటి పడితే శునకాల భయంతో ప్రజలు వీధుల్లోకి అడుగు పెట్టడం లేదు.

• కుక్కలు దాడి చేస్తాయిలా...

కుక్కల నుంచి తప్పించుకునేందుకు పెద్దలు శత విధాలా ప్రయత్నిస్తున్నారు. మరి చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. కుక్కల ఎత్తుకు పెద్దవారినైతే కాళ్ల పిక్కలు పట్టి లాగుతాయి. పిల్లల ఎత్తుకు శునకాలు సమాంతరంగా ఉండటంతో ముఖం, మెడ, చెవి, వీపు బాగాల్లో దాడి చేస్తాయి. కాటేసిన శరీర భాగం లోతు ఆధారంగా వైద్యులు చికిత్సకు సిఫార్సు చేస్తారు.

• ఈ జాగ్రత్తలు పాటించండి...

మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద ఆహార వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి.

పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా ఏడాదికోసారి విధిగా టీకాలు ఇప్పించాలి.

వీధి కుక్కలకు కూడా పురపాలక, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టీకాలు వేసే కార్యక్రమాలు నిర్వహించాలి.

అన్ని వీధుల్లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నందున పిల్లలను ఒంటరిగా బయటకు రానియరాదు.

నియంత్రణకు స్థానిక సంస్థలు, పశుసంవర్ధక శాఖ సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించాలి.

కుక్క కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన పెంచుకోవాలి.

బయటకు రావాలంటే భయమేస్తోంది

మండలంలో అనేక గ్రామాల్లో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. గ్రామాల్లో కనీసం 100 నుంచి 150 వరకు కుక్కలు నిత్యం స్వైరవిహారం చేస్తూ ప్రజలను గాయపరుస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్డు వెంట నడుస్తుంటే వెంటపడి కరుస్తున్నాయి. ప్రజా ప్రతినిధులకు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– కొణతాల హరినాథ్‌బాబు, అనకాపల్లి

బాలికల వసతి గృహానికి పరుపులు వితరణ



విద్యార్థినులకు పరుపులు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్ తెలిపారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ గుండాల జంక్షన్ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహంలో క్లబ్ ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల విలువ చేసే 130 పరుపులను ఉచితంగా శుక్రవారం వితరణగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ వసతి గృహంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేదల విద్యార్థినులు ఉంటూ ఇంటర్ నుంచి పీజీ వరకూ విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. వారికి వసతిగృహంలో మెరుగైన సౌకర్యాల కల్పనకు క్లబ్ తరుపున సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గ్రాంట్ చైర్మన్ పి.డి.జి.విశ్వనాథ్, హాస్టల్ వార్డెన్ ఓ తబిత, రోటరీ క్లబ్ కార్యదర్శి అనిల్, అనకాపల్లి రోటరీ క్లబ్ ప్రాజెక్ట్ చైర్మన్ కడిమిశెట్టి సతీష్, బుద్ధ రమణాజీ, సభ్యులు ఆరేపు కామేష్, సానా త్రినాథ్, సర్వారం, ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

రిక్షా కార్మికుల నిరసన



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రిక్షా కార్మికుల సంఘం నాయకులు

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో వేల సంఖ్యలో నివసిస్తున్న రిక్షా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లా రిక్షా కార్మిక సంక్షేమ ఐక్యవేదిక కన్వీనర్ సూదికొండ మాణిక్యాల రావు డిమాండ్ చేశారు. పట్టణంలోని రిక్షా కార్మిక సంఘాల నాయకులతో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ సమాజంలో నిరుపేదలు ఇప్పటికీ రిక్షా తొక్కడమే జీవనోపాధిగా కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారందరినీ ప్రభుత్వం తగిన విధంగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రిక్షా కార్మిక సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు గురుముపల్లి వెంకట్రావు, కార్యదర్శి పసుపులేటి నీలకంఠం, ఉపాధ్యక్షుడు బుర్లు సోమునాయుడు, కోశాధికారి నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే తయారు చేయాలి

అనకాపల్లి టౌన్: వచ్చే ఆగస్టులో వినాయక చవితి ఉత్సవాలకు మట్టి విగ్రహాలనే వినియోగించాలని వినాయక నిమజ్జనోత్సవ కమిటీ అధ్యక్షుడు ఆడారి కుమారస్వామి కోరారు. పట్టణంలోని సంప్రదాయబద్ధంగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసే శిల్పులను శుక్రవారం ఆయన కలిసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ మానవ రూపంలో ఉండే విగ్రహాలను తయారు చేయవద్దన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొడుకుల శ్రీకాంత్, దాడి బుజ్జి, పి. సోమశేఖర్ పట్నాయక్, రేబాక మధు, కొయిలాడ గణేష్, కర్రి భరత్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి పేటలో అన్నసమారాధన

అనకాపల్లి టౌన్: పట్టణంలోని లక్ష్మీదేవి పేట కనక దుర్గమ్మ ఆలయ 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనను తెలుగు దేశం పార్టీ నాయకుడు దాడి రత్నాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ పురోహితుడు ప్రతాప్ శర్మ, కమిటీ సభ్యులు గొర్లి రాము, ఏపూరి రమేష్, కర్రి గోపి, రేబాక మధు, మళ్ల శివగోవింద తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు కౌన్సెలింగ్ రేపు

కశింకోట: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో మిగిలిన సీట్లలో ప్రవేశానికి ఈ నెల 22న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి. గ్రేస్ తెలిపారు. సీటు రాని బాలికలు 2025-26 ప్రవేశ పరీక్ష ర్యాంకు కార్డును పట్టుకొని ఆ రోజు హాజరు కావాలని సూచించారు.

వైభవంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో శుక్రవారం గౌరీ పరమేశ్వరుల 205 ఊంజల్ సేవా కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాల కృష్ణశర్మ, పాందూరు సూర్యనారాయణ శాస్త్రి వేదమంత్రాలతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊంజల్ సేవా కార్యక్రమాన్ని అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు దంపతులు, గౌరీ పంచాయతన దేవాలయం కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం అనుబంధ సంస్థ కోఆర్డినేటర్లు బొగ్గరపు విశాలాక్షి, బొగ్గారపు సీత, పూసర్ల సుధాలక్ష్మి, గౌరీ పంచాయతన ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , కమిటీ సభ్యులు ఆళ్ల మహాలక్ష్మి, నాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల వెంకట సత్యప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో విద్యుత్ వెతలు

12 గంటల పాటు నిలిచిన సరఫరా



గవరపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కశింకోట: స్థానిక గవరపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, మరొకటి మరమ్మతులకు గురి కావడంతో సరఫరా లేక శుక్రవారం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సుమారు 12 గంటల పాటు విద్యుత్ సరఫరా లేక ఇక్కట్లకు గురయ్యారు. స్థానిక గవరపేట మధ్య వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీనికి పక్కనున్న మరో ట్రాన్స్‌ఫార్మర్‌పై గురువారం తాత్కాలికంగా కనెక్షన్ ఇచ్చి సర్దుబాటు చేశారు. అయితే ఒక్కసారిగా లోడ్ అధికం కావడంతో శుక్రవారం ఉదయం మూడు గంటల ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దాని పరిధితోపాటు మధ్య వీధిలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో సరఫరా నిలిచిపోయింది. అక్కడి నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర ప్రాంతం వరకు సరిగా సరఫరా పునరుద్ధరణ కాలేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లో వోల్టేజీతో విద్యుత్ సరఫరా అయ్యింది. లైట్లు సరిగ్గా వెలగని పరిస్థితి. అనంతరం మరమ్మతులు చేపట్టి మధ్యాహ్నం గంటపాటు విద్యుత్ సరఫరా చేశారు. మళ్లీ ట్రిప్ కావడంతో మరమ్మతులు చేపట్టి సాయంత్రం సరఫరా పునరుద్ధరించినప్పటికి రాత్రి వరకు పలు దఫాలు విద్యుత్ రావడం, పోవడం, లో వోల్టేజీతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఫ్యాన్లు, ఇళ్లలో నీటి మోటార్లు, మిక్సీలు పని చేయక మరింత ఇబ్బంది చెందారు. వేకువ జామున, పొద్దుపోయిన తర్వాత విద్యుత్ లేక కటిక చీకటిలో జీవనం సాగించాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. మధ్య వీధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్తది ఏర్పాటు చేసి 12 గంటల వ్యవధి తర్వాత మధ్యాహ్నం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

యోగాంధ్రకు ప్రత్యేక బస్సులు



ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సందీప్



యోగాంధ్రకు తరలించడానికి సిద్ధం చేసిన ఆర్టీసీ బస్సులు

కశింకోట: యోగాంధ్ర కార్యక్రమానికి కశింకోట నుంచి విద్యార్థులను తరలించడానికి అధికారులు శుక్రవారం సర్వం సిద్ధం చేశారు. మాకవరపాలెం, రావికమతం, కశింకోట మండలాల నుంచి 1200 మంది విద్యార్థులను ఆర్టీసీ బస్సుల్లో తీసుకువచ్చారు. వీరికి కశింకోట బాలికల హైస్కూలు, ప్రాథమిక పాఠశాల, డీపీఎస్ జెడ్పీ హైస్కూలు, బాల సదనంలలో వసతి, భోజన సదుపాయం కల్పించారు. నిద్రించడానికి గదులను కేటాయించారు. టాయిలెట్లు తక్కువగా ఉండటం కాల కృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బంది పడ్డారు. వీరిని శనివారం వేకువజామున బస్సుల్లో విశాఖలో యోగా దినోత్సవానికి తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి సందీప్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి. సత్యనారాయణ, ఎంఈవోలు సురేష్‌కుమార్, కె.ఎస్.ఎన్. మూర్తి, ఉపాధ్యాయులు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏర్పాట్లు పరిశీలన

కశింకోటలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వసతి ఏర్పాట్లను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. అనకాపల్లి ఆర్డీవో అయిషా సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారదర్శకంగా భూ రికార్డుల నిర్వహణ



రెవెన్యూ డే కార్యక్రమంలో తహసీల్దార్ భుజంగరావు

కె.కోటపాడు : రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో పారదర్శకంగా భూ రికార్డుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ భుజంగరావు తెలిపారు. రెవెన్యూ డే సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయాల్లో రెవెన్యూ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. సిబ్బందితో రెవెన్యూ డే ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ అభివృద్ధికి గెయిల్ సహకారం

కోటవురట్ల: పాములవాకలోని కిల్లాడ రామ్మూర్తి నాయుడు జెడ్పీ హైస్కూల్‌లో గెయిల్ కంపెనీ సహకారంతో డైనింగ్ హాల్‌ను అభివృద్ధి చేయనున్నట్టు మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పాఠశాలలోని డైనింగ్ హాల్ నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోవడంతో ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినట్టు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన గెయిల్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి డైనింగ్ హాల్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.22 లక్షలు మంజూరు చేయించినట్టు తెలిపారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి దీనికి పరిపాలనాపరమైన అనుమతులు కోరగా, వెంటనే మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

వరి నారుమళ్లు సిద్ధం చేసుకోవాలి

అనకాపల్లి: వరి నారుమళ్లు వేసుకోవడానికి నేలను దున్ని తయారు చేసుకుని, 2 కిలోల యూరియా, 6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1 కిలో మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకుని ఎకరాకు 20 కిలోల చొప్పున విత్తనం వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెద పద్ధతిలో విత్తడానికి ఎంటీయూ-1262, 1318, 1224 వంటి వరి రకాలను ఎంపిక చేసుకుని కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండజింతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఖరీఫ్ మొక్కజొన్నలో అధిక దిగుబడినిచ్చే డిహెచ్ ఎం-117, 119, 121 వంటి రకాలను ఎకరాకు 8 కిలోల చొప్పున 60 ఇన్‌టూ 20 సెం.మీ దూరంలో విత్తుకోవాలన్నారు. విత్తేముందు సయాంట్రనిలిప్రోల్, థయోమిథాక్సామ్ 6 మి.లీ. కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలన్నారు. తద్వారా కత్తెర పురుగు ఉధృతిని కొంత వరకు తగ్గించవచ్చన్నారు. 20 నుంచి 25 వయసు గల నువ్వు పైరులో కలుపు తీసి గొప్పు తవ్వకోవాలన్నారు. నువ్వు పైరులో ఆకుముడత ఆశించే అవకాశం ఉన్నందున, ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. 120 రోజుల వయసు గల చెరకు పైరులో మొక్కల వరుసల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలని, పంట ఎదుగుదలను బట్టి మొవ్వులో 8 ఆకులు వదిలి జడచుట్టు వేసుకుంటే గాలులకు తోట పడిపోకుండా కట్టుకోవాలని సూచించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మాకవరపాలెం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని జంగాలపల్లి నుంచి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా మండలంలోని రాచపల్లి జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు తప్పవన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట: పట్టణంలోని ఐటీఐ కళాశాలలో 2025-26 సంవత్సరానికి ప్రవేశాల కోసం(రెండో విడత) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువ పత్రాలతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు జూలై 15 ఆఖరి తేదీ అన్నారు. జూలై 17 ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు ఆఖరి తేదీ అని పేర్కొన్నారు. వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేనియెడల పేర్లు మెరిట్ లిస్ట్‌లో కనిపించవని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, కుల, పాస్‌పోర్టు ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఫోన్ నంబరుతో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు.

ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న అప్పారావు, డి.జి.నాథ్

నర్సీపట్నం: విశ్రాంత హెచ్ఎం,జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బలిరెడ్డి అప్పారావు మున్సిపాలిటీలో శివపురం మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు రూ.20 వేల విలువ చేసే నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అప్పారావుతో పాటు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్ నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి.సాంబ రాజు, చైర్మన్ జాన్, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి జి.వి.రమేష్, ఉపాధ్యాయులు ఇంద్రావతి, సరస్వతి, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.